

పి.4పై అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష


మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - కొత్తపేట

. వాడపాలెంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో పి.4 కార్యక్రమంపై నియోజకవర్గ ప్రత్యేక అధికారి బివి. రమణ, డిఎల్‌డిఒ ఎస్‌టివి.రాజేశ్వరరావు, నాలుగు మండలాలకు సంబంధించిన ఎంపిడిఒలతో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పి.4 కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబు రూపొందించారన్నారు. పి.4 జీరో పావర్టీ ద్వారా పేదరికం నిర్మూలించే లక్ష్యంతో 'బంగారు కుటుంబాలు పి.4 పోర్టల్ ద్వారా ఎంపిక చేయడానికి దత్తత ప్రక్రియపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే విజన్ - 2047, పి.4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.

వసతి గృహంలో సమస్యల తిష్ట

- తీవ్ర అపరిశుభ్రత
- 6 నెలలైనా పూర్తికాని మరమ్మతులు
- చర్మ వ్యాధులతో విద్యార్థుల సతమతం
- ఇటీవల విజృంభించిన జ్వరాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ హసన్‌బాదలో సమస్యలు తిష్ట వేశాయి. శిథిలావస్థలో ఉండి తీవ్ర అపరిశుభ్రంగా ఉన్న ఈ హాస్టల్ లో 86 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్నా ఈ భవనం మరమ్మతులకు మార్చిలో రూ.35 లక్షలు నిధులు కేటాయించారు. ఆరు నెలలు పూర్తయి వర్షాలు వస్తున్నప్పటికీ మరమ్మతు పనులు పూర్తి కాలేదు. ఇక్కడ పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కనీసం రూములు తుడవకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త చెదారం దర్శనం ఇస్తుంది. ఇక బాత్రూంల వద్ద పారిశుధ్య మరింత అద్వానంగా ఉంది. వీటిని సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెద జల్లుతున్నాయి. ఈ హాస్టల్ భవనం అక్కడక్కడ లీకులు కావడంతో మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ ఆరు నెలలు గడిచిన నేటికి పూర్తిగాకపోవడంతో వాటిని పర్యవేక్షించే నాధుడే లేడు. దీంతో కాంట్రాక్టర్ పనులను మరింత నత్త నడకన కనసాగిస్తున్నారు

హాస్టల్లో అమలు కాని మెనూ


ప్రభుత్వ నిబంధనల ప్రకారం కలెక్టర్ ఏర్పాటు చేసిన మెనూ కేవలం చార్టులకే పరిమితమైంది. ప్రతి ఆదివారం పూరీ పెట్టవలసి ఉండగా ఉప్మా పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా ఆదివారం చికెన్ బిర్యాని, గోంగూర పచ్చడి, పెరుగు చట్నీ ఇవ్వాల్సి ఉండగా కేవలం చికెన్ బిర్యానీ పెరుగు చెట్నీ మాత్రమే వడ్డిస్తున్నారు. ఉదయం టిఫిన్ తో గుడ్డు ఇవ్వాల్సిన గా ఆదివారం ఇవ్వలేదని విద్యార్థులు ప్రజాశక్తికి తెలిపారు.

విజృంభిస్తున్న వ్యాధులు

హాస్టల్ విద్యార్థుల్లో సుమారు 20 మందికి గత నెలలో జ్వరాలు రావడంతో ద్రాక్షారామ ఆరోగ్య కేంద్ర వైద్యులతో చికిత్స అందించారు. అయితే ఇంకా పలువురు విద్యార్థులకు 10వ తరగతిలో సాయి, తొమ్మిదో తరగతిలో క్రాంతి తీవ్రమైన చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ విద్యార్థులను అనారోగ్యం కారణంగా ఇంటికి తీసుకుపోయినట్లు సమాచారం. హాస్టల్లో పారిశుధ్యం పనులు మెరుగుపరచాలని, ఎప్పటికప్పుడు గదులు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లను ఫినాయిల్ తో శుభ్రపరిచి వాటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేయించాలని, విద్యార్థులకు తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించి చర్మవ్యాధులను అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న హసన్ బాద సాంఘిక సంక్షేమ హాస్టల్ ఇదే (ఇన్‌సెట్‌లో) వసతిగృహం గదుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం


చర్మ వ్యాధితో విద్యార్థి


పరుపులు లేని ఇనుప మంచాలు

మరమ్మతులు ఈనెలాఖరుకు పూర్తవుతాయి

హసన్ బాదలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ మరమ్మతులపై వార్డెన్ అబ్బిరెడ్డి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కాంట్రాక్టర్ పనులు నెమ్మదిగా కొనసాగించడం వల్ల ఆరు నెలలైనా పూర్తి కాలేదన్నారు. ఈ నెలాఖరు కు పూర్తి కావచ్చని వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

బాలుర వసతి గృహంలో తనిఖీ

ప్రజాశక్తి -మామిడికుదురు

బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని డిఎల్‌డిఒ వేణుగోపాల్ మంగళవారం తనిఖీ చేశారు మురికి నీరు పారుదల కాక విద్యార్థులు ఇబ్బందులను పరిశీలించారు దీనిపై స్పందించి మురుగునీరు మళ్లించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాకన పాలెం లో అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులపై సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం మండల పరిషత్ కార్యాలయములో పలు ప్రభుత్వ కార్యక్రమాలపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. బంగారు కుటుంబాలు,వర్క్ ఫ్రమ్ హోం, ఇంటి పన్నులు వసూలు తదితర అంశాలపై చర్చించారు ఈ సమీక్ష సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి


ముమ్మిడివరంలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పౌరుల్లో శాస్త్రీయ దకృథాన్ని పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కషి చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జెవివి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులను సభ్యులుగా నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.లక్ష్మి ప్రశాంతి మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యపరుస్తూ, ప్రజల్లోని అజ్ఞానాన్ని తొలగించి, ప్రగతికి అవరోధంగా ఉన్న మూఢ నమ్మకాల వ్యాప్తిని నిరోధించడంలో జెవివి చేస్తున్న కృషికి తమ వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జనవిజ్ఞానవేదిక గోడ పత్రికను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో కోలా వెంకటేశ్వర రావు, చెకుముకి జిల్లా కన్వీనర్ నేరేడుమిల్లి అబ్బులతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న అమలాపురం డిఎస్‌పి ప్రసాద్, పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకుని నేరగాళ్ల డబ్బులు దోచుకుంటున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌ల వాడకంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఫేస్‌బుక్ చాటింగ్‌లకు దూరంగా ఉండాలని, అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మహిళా భద్రత, డ్రగ్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించి, మహిళా సంరక్షణకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యత, పోలీస్ శాఖ అందిస్తున్న రక్షణ వ్యవస్థ గురించి వివరించారు. ముఖ్యంగా శక్తి యాప్ యొక్క ఉపయోగాలు, మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, వేధింపులకు గురిచేసేవారిపై తీసుకునే కఠినచర్యల గురించి తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు హితబోధ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు మీ వ్యక్తిగత, బ్యాంక్ వివరాలను ఎప్పుడూ ఇవ్వవద్దు, మీ ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎవరికీ చెప్పవద్దు, అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు, సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం యువతలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిరోధం, రోడ్ సేఫ్టీ, ర్యాగింగ్ వంటి విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించింది.



విజయోత్సవ ర్యాలీలో ఎంఎల్ఎ గిడ్డి, కూటమి శ్రేణులు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పిగన్నవరం

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ గిడ్డి సత్యనారాయణ అన్నారు. సంక్షోభంలోనూ, సంక్షేమంలోనూ కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకాలు విజయోత్సవం సందర్భంగా మంగళవారం పి.గన్నవరం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుంచి అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు అన్నదాత సుఖీభవ అంటూ నినాదాలతో ఎంఎల్ఎ ఆధ్వర్యంలో సుమారు 100 ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అన్నదాత సంతోషంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మొదటి విడత గా నియోజకవర్గంలో 23,727 మంది రైతుల ఖాతాలలో 16.31 కోట్లు జమ చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికల హామీ నిలబెట్టుకున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



డీ వార్మింగ్ మాత్రల పంపిణీ


నగరంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం డీవార్మింగ్ మాత్రలను వైద్యసిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మామిడికుదురు: నులిపురుగుల నిర్మూలన తోనే పిల్లలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చని నగరం పి హెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జాన్ లెవీ అన్నారు నగరం హైస్కూల్లో డి వార్మింగ్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండ్ జోల్ మాత్రలు పంపిణీ చేశారు.నులి పురుగుల వల్ల పోషకాహార లోపం ఏర్పడుతుందని, శారీరక మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. పెదపట్నం లంకలో సర్పంచ్ సుందరనేడి రాజేష్ కుమార్, సిహెచ్ఒ పుల్లెల నాగ దుర్గ ఆధ్వర్యంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, మూడు అంగన్వాడీ కేంద్రాలు, హైస్కూల్ లో 289 మంది విద్యార్థులకు ఆల్బండ్ జోల్ టాబ్లెట్స్ అందించారు ఈ కార్యక్రమాల్లో నగరం సర్పంచ్ జాలెం రమణ కుమారి, సిహెచ్ఒ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ నరసింహరావు, పెదపట్నంలంక ఎఎన్ఎం పి.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఐ.పోలవరం:** కేశనకుర్రు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10 సచివాలయంలో మంగళవారం నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి సెంటర్లు, స్కూల్స్, కాలేజీ లో ఒకటి నుంచి 19 సంవత్సరముల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండిజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం నోడల్ అధికారి ఎన్.రవి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎంఎస్.రాజేష్ బాబు, జియు.నాగవర్ష, ఎం.రాజేష్ బాబు, ఎంపిడిఒ డిఎల్ఎస్. శర్మ, ఎంఇఒ ఎన్.కొండ రెడ్డి, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఎంపిహెచ్ఇఒ ఎం.వెంకటేశ్వర్లు ఆరోగ్య పర్యవేక్షకులు కె.రమేష్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** బండారులంకలోని జడ్‌పి ఉన్నత పాఠశాల నందు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సర్పంచి పెనుమాల సునీత చేతుల మీదుగా విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ .లక్ష్మి వెంకట బాల, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పేరూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సర్పంచ్ దాసరి అరుణ, స్కూల్ హెచెం విజయకుమారి ఆధ్వర్యంలో నులుపురుగులు నివారణకు విద్యార్థులకు డివార్మింగ్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** అంగర పిహెచ్‌సి పరిధిలోని 6 సచివాలయాల పరిధిలో ఉన్న 15 ప్రభుత్వ, 8 ప్రయివేటు పాఠశాలలు, 1 ప్రభుత్వ కళాశాల, 28 అంగన్వాడీ కేంద్రాలలోని విద్యార్థులు,చిన్నారులకు, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ 91.3 శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి పి.రత్నకుమారి, ఎంపిహెచ్ఇ జె మల్లిగార్జునుడు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాని బాబు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** బాలల శారీరక క్షీణతకు కారణమయ్యే నులిపురుగుల నిర్మూలన కోసం అవగాహనతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎ.రాజు, ఎంఇఒ బి.అప్పాజీ, చొప్పెల్ల, పెదపళ్ల పిహెచ్‌సి వైద్యాధికారులు ఎస్.లక్ష్మి స్నేహలత, డి.సాయి కిషోర్ అన్నారు. డి-వార్మింగ్‌డే సందర్భంగా ఆయా పిహెచ్‌సిల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ మంగళవారం చేశారు. మండలంలోని రెండు పిహెచ్‌సి పరిధిలోనున్న 18 గ్రామాల్లో 49 ప్రభుత్వ, 13 ప్రయివేటు పాఠశాలలు, 76 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో 12,466 మందికి అల్బెండజోల్ మాత్రలను మింగించవలసి ఉందని వైద్యాధికారులు తెలిపారు. చొప్పెల్ల పిహెచ్‌సి పరిధిలోనున్న 7007 మందికి గాను 6713 మంది, పెదపళ్ల పిహెచ్‌సి పరిధిలో 5462 మందికి గాను 5174 మందికి ఈఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. దీంతో మండలంలో 95.35 శాతం మేర ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగినట్లు ఆయా పిహెచ్‌సి వైద్యాధికారులు పేర్కొన్నారు. మిగిలిన బాలలకు ఈనెల 20న ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నామని వైద్యాధికారులు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్లు ఎవివి.రాజా, బి,సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఆర్,బాలామణి, తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** మండల పరిధి కళాశాల,ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని నిర్వహించి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మంగళవారం పొడగట్లపల్లి లక్ష్మీపాలెం మినీ అంగన్వాడీ కేంద్రం లో కార్యకర్త శ్రీలక్ష్మి, ఎఎన్ఎం అనసూయ జాతీయ నులిపురుగుల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఆశా,తల్లులు,స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆలమూరులో విద్యార్థిని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


లక్ష్మీపాలెం అంగన్‌వాడీలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా వైసిపి నాయకులు

మాజీ ఎంపీ సురేష్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

బాపట్ల మాజీ ఎంపీ, ప్రస్తుత పార్లమెంట్ ఇన్‌ఛార్జి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబెర్ నందిగం సురేష్‌ను మంగళవారం తాడేపల్లిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ ఎంపీ సురేష్ మాట్లాడుతూ వైసిపి కోసం శ్రమించి కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు నిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు సూచించినట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో అంబాజీపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా యువజన విభాగం మాజీ జనరల్ సెక్రెటరీ చేట్ల రామారావు, అమలాపురం పట్టణ పార్టీ సీనియర్ నాయకులు నవుండ్రు రమేష్, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు కొండేటి సురేష్ బాబు, మంద దుర్గారావు పాల్గొన్నారు.

బాల మందిరం ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ఆలమూరు

అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ బాల మందిరం ఆధ్వర్యంలో సంధిపూడి జడ్‌పిఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించి నట్లు బాల మందిరం వ్యవస్థాపకులు కృష్ణ శ్రీ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథపఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రంథ పఠనంతో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందుతుందని ప్రచురణ సంస్థ తురగా పబ్లికేషన్స్ అధినేత తురగా కృష్ణ కుమార్ వ్యాఖ్యానించారు. చింతలూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల గ్రంథాలయానికి విలువైన బాలల భారతం, భాగవతం, రామాయణం, శతక దర్శనం మూడు భాగాలు, పద్య శతక పుస్తకాలు, నీతి కథల పుస్తకాలు ఉపాధ్యాయులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్‌టిఆర్

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నటుడు నారా రోహిత్

ప్రజాశక్తి - రామచంద్రపురం

సంక్షేమ పథకాలకు ఆద్యుడు టిడిపి పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు(ఎన్‌టిఆర్) అని సినీ నటుడు నారా రోహిత్ వ్యాఖ్యానించారు. రామచంద్రపురం బైపాస్ రోడ్డు పసలపూడి వద్ద టిడిపి నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం రూ.9లక్షలతో నిర్మించిన ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరణ నారా రోహిత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిపాలనలో సంస్కరణలు తీసుకొచ్చిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కూటమి పాలన సాగుతుందని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేస్తూ సిఎం చంద్రబాబు మంచి పరిపాలన అందిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటును అభినందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, గంధం పల్లంరాజు, కూటమి పార్టీ నాయకులు, మహిళా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నారా రోహిత్ ను, మంత్రి సుభాష్‌ను, శిల్పి వడయార్‌ను కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగాసత్కరించారు.


ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరణలో నటుడు నారా రోహిత్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


మండపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి - మండపేట

రైతుల అభ్యున్నతి, వ్యవసాయ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఎంఎల్ఎ చాంబర్ నందు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) సభ్యులు, అధికారులతో ఎంఎల్ఎ వేగుళ్ళ సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా సొసైటీలలో రైతులకు ఇచ్చిన లోన్లు, పెండింగ్ బకాయిలు, వివిధ అంశాలపై రివ్యూ నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ వేగుళ్ళ మాట్లాడుతూ రైతులకు కావలసిన లోన్లు, ఎరువులు సకాలంలో ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. 21 సొసైటీ లలో ఎన్ని సొసైటీ లు ఎరువులు అందిస్తున్నాయని ప్రశ్నించగా 8 సొసైటీ లు తప్ప మిగిలిన అన్నీ సొసైటీ లు అందిస్తున్నాయని సొసైటీ సిఇఒలు తెలిపారు. ఆ 8 సొసైటీలలో కూడా ఎరువులు ఇచ్చే ఏర్పాటు చెయ్యాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఏప్రియల్ 2019 కి ధాన్యం కమీషన్ సొమ్ము ఎంత రావలసి ఉన్నది, జులై 2025 కి ఎంత రావలసి ఉన్నది వాటి వివరాలు ఇవ్వాలన్నారు. కొన్ని కమర్షియల్ బ్రాంచ్ లలో అప్రైజర్ ఉన్నప్పటికీ గోల్డ్ లోన్లు విషయంలో కొన్ని తప్పిదాలు జరుగుతున్నాయని, అందువల్ల గోల్డ్ లోన్లు ఇవ్వవద్దన్నారు. రైతులు సొసైటీల ద్వారా తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించి తద్వారా సొసైటీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంఎల్ఎ కోరారు. వెలగతోడు పిఎసిఎస్ కు సంబంధించి బకాయిలు మొత్తం వసూలు చేసినందుకు సిఇఒ వంక కృష్ణమూర్తిని ఈ సంధర్బంగా అభినందించి సత్కరించారు. అనంతరం మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా నియమితులైన పిఎసిఎస్ సభ్యుల అందరూ తమ తమ సొసైటీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బకాయిలు వసూలు చేయించటమే కాకుండా, రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమం లో డిసిఒ రాధాకృష్ణ, రామదాసు కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ లెక్చరర్ ఎ.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రరర్లు, ఆయా మండలాల అగ్రికల్చర్ ఎఒలు, సొసైటీల సిఇఒలు, త్రిమెన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కాకినాడ

టిటిడి కల్యాణ మండపం మేనేజర్ వేధింపులు తాళలేక వాచ్‌మెన్ భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం కాకినాడలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక బాలాజీ చెరువు కూడలి వద్ద గల టిటిడి కల్యాణ మండపంలో వాచ్‌మెన్‌గా కుశ్వంత్ పని చేస్తున్నాడు. అతని భార్య స్వీపర్‌గా పని చేస్తుంది. అయితే ఇటీవల కల్యాణ మండపానికి మేనేజర్‌గా వచ్చిన రాజు చీటికిమాటికి దుర్భాషలాడుతూ తమను వేధించడమే కాకుండా తాను లేనప్పుడు తన భార్యను దూషిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఆమెను దూషించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో హుటాహుటిన ఆమెను జిజిహెచ్‌కి తరలించారు. అనంతరం 100కి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో ఆమె మెరుగైన వైద్యం అందడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జరిగిన సంఘటనపై విచారణ చేసి తన కుటుంబానికి న్యాయం చేయాలని వాచ్‌మెన్ కుశ్వంత్ కోరారు.

అత్యాచారయత్నం ఘటనలో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

రాత్రివేళ ఇంటిలో నిద్రిస్తున్న వివాహితపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేయడంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ మంగళవారం తెలిపారు. నిందితుడిని ముమ్మిడి వరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు. రెండు రోజుల క్రితం చెయ్యేరులోనీ బ్రాహ్మణ చెరువులో ఇంట్లో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న వివాహితపై దార్ల అన్నవరం అలియాస్ చిన వీర వెంకట సత్యనారాయణ అత్యాచారయత్నం చేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట ప్రవేశ పెట్టామన్నారు. ఈ ఘటనలో నిందితునికి 15 రోజులు రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నర్సిపూడి శివారు పొలాలలో పేకాట శిబిరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా నర్సిపూడి లో ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3,280 స్వాధీనం చేసుకుని నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే వారిపైనా ఏపీ గేమింగ్ యాక్ట్ పై కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోనసీమ మీదుగా 'పొల్యూషన్ కా సొల్యూషన్' సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - సఖినేటిపల్లి


సైకిల్ యాత్ర చేస్తున్న మహేష్

పొల్యూషన్ కా సొల్యూషన్" పేరుతో నీటిని, చెట్లను కాపాడాలనే నినాదంతో తెలంగాణకు చెందిన యువకుడు మహేష్ గౌడ్ చేపట్టిన యాత్ర అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం సాగింది. జిల్లాకు చెందిన దిండి గ్రామం నుండి వశిష్ఠ గోదావరి వారధి మీదుగా చించినాడ వైపు వెళ్తున్న ఆయనను పలకరించగా., వివరాలు తెలియజేశారు. గత ఏడాది అక్టోబర్ 17న మహబూబ్ నగర్ జిల్లాలో బోయిపల్లి గ్రామం నుండి ప్రారంభమయినట్లు తెలిపారు. సాధారణ రోజు వారి కూలి అయిన మహేష్ గౌడ్ భారతదేశ యాత్ర చేపట్టాలని పొల్యూషన్‌పై, నీటి విలువ, చెట్ల పెంపకం పై అవగాహన కల్పించాలని తాను కోరుకొంటున్నట్లు అయన తెలిపారు. తన గ్రామం నుండి ప్రారంభమైన యాత్ర తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, నేపాల్, పశ్చిమ బెంగాల్, ఒడిశా పూర్తి చేసుకొని ఎపిలో కొనసాగుతుందని తెలిపారు. తమిళనాడు కేరళ గుండా గోవా వెళ్తానని అయన పేర్కొన్నారు.

వాడపల్లిలో ఆలయ అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి దివ్య క్షేత్రంలో శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధానంలో యాత్రికుల దర్శనాలకు ఇబ్బందులు తలెత్తకుండా తూర్పు, ఉత్తర, దక్షిణ ద్వారాలు, ఆల్వార్ సన్నిధి నవీకరణలో భాగంగా అభివద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. రోజురోజుకి యాత్రికుల రద్దీ పెరుగుతున్న దష్ట్యా యాత్రికులకు స్వామివారి దర్శనం సులభతరం చేసేందుకు తూర్పు, ఉత్తర, దక్షిణ సింహద్వారాలను వెడల్పు చేస్తున్నట్లు డిసి నల్లం సూర్య చక్రధరావు తెలిపారు.

ఆరుతడి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో మంగళవారం వరి పంటలో ఆరుతడి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. పాలంగి, వెలగదుర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణతో కలిసి, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా వరి పంటలు, ఆరుతడి వ్యవసాయం ద్వారా నీటి యాజమాన్యం పురుగులు, తెగుళ్ల నియంత్రణ, యాజమాన్యాన్ని పూర్తిస్థాయిలో ఆరుతడి వ్యవసాయం ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ఆరు తడి వ్యవసాయం వల్ల నీరు వృథా కాకుండా, పురుగులు, తెగుళ్లను సమూలంగా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా లోపంతో రోడ్డు నిర్మాణం


నాసిరకం మెటీరియల్‌తో నిర్మించిన బొబ్బర్లంక-అమలాపురం రోడ్డు

ఇష్టానుసారంగా పనులు చేస్తున్న గుత్తేదారు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రైతుల పంట పొలాలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు సైఫాన్లు నిర్మించే సమయంలో బొబ్బర్లంక అమలాపురం ఆర్ అండ్ బి రోడ్డును రెండు చోట్ల 30 మీటర్ల పొడవు చొప్పున తవ్వి సిమెంటు పైప్లైన్లు వేశారు. సైఫాన్ నిర్మాణం పూర్తయిన తర్వాత రోడ్డును పటిష్టంగా చేసేందుకు ఇసుక వేసి ఫిల్లింగ్ చేయవలసి ఉంది. అయితే నల్ల మట్టిని వేసి హడావిడిగా రెండు చోట్ల రోడ్లను పూడ్చారు. నల్ల మట్టిపై ఎర్ర గ్రావెల్ వేసి వైబ్రోమిక్స్ రోటరీతో తొక్కించకుండా సాధారణ రోడ్డు రోలర్ తో తొక్కించడంతో రోడ్డు రెండుసార్లు కూడా కిందికి దిగిపోయింది. అలాగే మెర్లపాలెం వద్ద రోడ్డు వెడల్పు పది మీటర్లు ఉండగా ఎనిమిది మీటర్లు నల్ల గ్రావెల్ వేసి మిగతా రెండు మీటర్లు ఎర్ర గ్రావెల్ వేయడంతో రోడ్డు భారీ వాహనాలకు రోడ్డు మధ్యలో కుంగిపోతోంది. రోడ్డు రెండు చోట్ల మధ్యలో దిగిపోవడంతో మిక్సింగ్ గ్రావెల్ వేసి పటిష్టపరిచి దానిపై తారు రోడ్డు వేయవలసి ఉండగా డ్రైనేజీ శాఖ అధికారులు గుచ్చేదారు కొమ్ము కాయడంతో ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. శనివారం వచ్చిందంటే బొబ్బర్లంక నుండి రావులపాలెం వరకు రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుంది. లొల్ల కొత్త వంతెన వద్ద పది మీటర్లు రోడ్డు వెడల్పు ఉండగా రోడ్డు ఇరువైపులా మీటర్ వెడల్పున బెర్మ్ ఉండాలి బెర్మ్ లేకుండానే రోడ్డు వేయడంతో వాహనాలు వెళ్ళే సమయంలో వాహన శోధకులు అంచుకు వెళితే ప్రమాదం తప్పదు.రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై డ్రెయినేజీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకున్న దాఖలాలు లేవని వారు ఆరోపిస్తున్నారు. అయితే తారు రోడ్డు కూడా నాసిరకం మెటీరియల్తో వేయడంతో వాహనాలు వెళ్లే సమయంలో టైరుకు కంకర అంటుకొని రోడ్డు గోతులమయంగా మారుతోంది. పనులు జరిగేటప్పుడు డ్రెయినేజీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేయడంతో ప్రయాణికులకు ఈ రోడ్డుపై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని ఇస్తానుసారంగా పనులు చేస్తున్న గుత్తేదారిపై చర్యలు తీసుకుని రోడ్డు పటిష్టంగా ఉండేలా పనులు చేయాలని వాహన చోదకులు కోరుకుంటున్నారు.


మధ్యభాగంలో దిగిపోయిన బొబ్బర్లంక-అమలాపురం రోడ్డు



దాతల సమకూర్చిన కాటన్ బ్యాగులతో ఎంఎల్ఎ గిడ్డి, ప్రజా ప్రతినిధులు నాయకులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించి కాటన్ బ్యాగులు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సూచించారు. పి గన్నవరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం నందు మంగళవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఇసుకపూడి పంచాయతీ సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబురావు ఆధ్వర్యంలో దాతలు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, మునుకుంట్ల రాముడు కుటుంబ సభ్యులు సమకూర్చిన కాటన్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలో ఇసుకపూడి నుంచి ప్లాస్టిక్ బ్యాగులు నిషేధం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు,గ్రామ నాయకులను ఎంఎల్ఎ అభినందించారు. ప్రతి గ్రామంలో అందరూ సహకరించి నియోజకవర్గం ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

నేటి యువకులు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్యంగా రాజకీయాల్లోకి రావాలని యువతులు కూడా రాజకీయాల లలో ప్రవేశించాలని సినీనటుడు నారా రోహిత్ పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్ లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల కళాశాల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నటుడు రోహిత్ మాట్లాడుతూ యువకులను రాజకీయాల వైపు ఆకర్షితులు కావాలని నచ్చిన రంగాన్ని ఎంచుకొని దేశానికి దిశా నిర్దేశం చేసేందుకు యువకులు ఆలోచన చేయాలి అన్నారు నేడు సినీ రంగంలోనూ యువ దర్శకులు ప్రవేశించి హవా చాటుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సుభాష్ మాట్లాడుతూ యువకుల అభివృద్ధికి ప్రభుత్వం ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకుంటుంది అన్నారు. తాము ఉద్యోగమేల ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించామన్నారు. అనంతరం సుందరకాండ చిత్ర ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, అక్కల రేశ్వంత్ రాయ్, మోడరన్ కళాశాల అధినేత లయన్ జీవి రావు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మండలంలోని వాడపల్లిలో గ్రామంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 1931 ఏకాదశి రోజున స్వామివారి కల్యాణోత్సవంలో రథోత్సవాన్ని స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రారంభించారని రథంపై మహాత్మా గాంధీ చిత్రం, జాతీయ పతాకం ఉంచినందుకు బ్రిటీష్ సిపాయిలు ఆపడానికి యత్నించారని తెలిపారు. అయితే గ్రామస్తులు, యాత్రికులు వెనకడుగు వేయకుండా ప్రతిఘటించడంతో కాల్పులు జరిగి పలువురు అమరులయ్యారన్నారు. వారిని తరతరాలూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. పడాల నాగేశ్వరరావు, అల్లు భాస్కరరావు, కాలాబత్తుల చిన్నారి, గూడవల్లి రాంబాబు, సిస్ట కుటుంబ రావు తాడాల సుబ్రహ్మణ్యం ప్రజలు పాల్గొన్నారు

ఎపిపిగా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్

ప్రజాశక్తి - ఆలమూరు

రామచంద్రపురం 13వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఆలమూరుకు చెందిన కప్పల సునీల్ కుమార్ ఈ నెల11న బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆ కోర్టుకు ఇంచార్జ్ న్యాయమూర్తిగా ఉన్న కాకినాడ మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆనంది ని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఈ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా జిల్లా కోర్టు హోదా పొంది, ఈ కోర్టుకు తొలి ఏపిపీగా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్ ను పలువురు న్యాయవాదులు అభినందించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ బాధితుల పక్షాన అండగా నిలిచి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
రామచంద్రపురం: రామచంద్రపురం జిల్లా సెషన్స్ కోర్టుకు మొదటి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన కప్పల సునీల్ కుమార్‌ను మండలమాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఈరెళ్ళ రాజు గౌరవ అధ్యక్షులు రవ్వ భూషణం, తరపట్ల ఆనందరావు, ట్రెజరర్ తోకల వెంకటరమణ, నామాడి సుబ్బారావు ఇతర నాయకులు పాల్గొని సునీల్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. సామాన్యులకు మెరుగైన సేవలు అందించాలని అభిలాషించారు.

ఎంఎల్‌సి ఇజ్రాయిల్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ దళితుడైనందునే జన సైనికులు ఇష్టానుసారంగా విమర్శలు చేయడం తగవని వైసిపి వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు చేట్ల విద్యాసాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విద్యాసాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై సందర్భానుసారంగా ఎంఎల్‌సి ఇజ్రాయిల్ మాట్లాడితే దానికి జన సైనికులు ఏది పడితే అది ఆధారాలు లేని వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జిల్లాలో మాదిగలను సమీకరించి వారి గౌరవాన్ని నిలబెట్టింది ఇజ్రాయిల్ మాత్రమేనని అన్నారు. అంతేగాని మీ నాయకుడులా నమ్ముకున్న పార్టీ కోసం కాకుండా వేరే పార్టీ కోసం వేరే జండా మోయలేదని మీరు చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌సి ఇజ్రాయిల్ ఎవరికి ఇష్టమొచ్చినట్టు వారు మాట్లాడితే మాదిగలు చూస్తూ ఊరుకోర విద్యాసాగర్ హెచ్చరించారు.

ఆర్థిక వ్యవహారాలపై మహిళా సంఘాలకు అవగాహన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆర్థిక వ్యవహారాలలో మహిళా సంఘాలకు భరోసా కల్పించేందుకు అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళా శక్తి భవన్ లో మంగళవారం ఎపిఎం అయితాబత్తుల సురేంద్ర బాబు అధ్యక్షతన మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. మన లెక్కలు మన పొదుపులు అనే యాప్ పై లీగల్ కో-ఆర్డినేటర్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు.యాప్‌లో సంఘ సభ్యురాలు సంఘంలో ఎంత అప్పు తీసుకున్నది ఎంత చెల్లించినది ఎంత అప్పు నిల్వ ఉన్నది అనే వివరాలను వాయిస్ మెసేజ్ ద్వారా చెప్పేందుకు ఈ యాప్ లో రూపకల్పన చేశారని తెలిపారు. యాప్ ను మండలంలోని 1523 మహిళా సంఘాలకు మొబైల్ బుక్ కీపింగ్ 2.0 ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఉన్న పొదుపు నిల్వలు, అప్పు నిల్వలు నమోదు చేస్తారన్నారు.

నేడు ఆలమూరులో రైతు సంబర సభ

ప్రజాశక్తి - కొత్తపేట

అన్నదాతలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతుగా బుధవారం ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో రైతు సంబర సభ నిర్వహిస్తారని కొత్తపేట మండల టిడిపి అధ్యక్షులు గనిశెట్టి వీరేష్, కొత్తపేట మండల టిడిపి ప్రధానకార్యదర్శి కడలి భీమేశ్వరరావు, కొత్తపేట మండల తెలుగు యువత అధ్యక్షులు ఇళ్ళ రామ సుబ్రహ్మణ్యం మంగళవారం ప్రకటన విడుదల చేశారు. . చొప్పెల నుండి ట్రాక్టర్ ర్యాలీగా బయలుదేరి ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికిలి చేరుకుంటారన్నార. ఎంపి హరీష్ మాధుర్, జిల్లా టిడిపి అధ్యక్షులు రెడ్డి అనంత కుమారి, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, పలువురు నేతలు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, రైతులు హాజరు కావాల్సిందిగా కోరారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఆలమూరు

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందకూటమి నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అలాగే కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేసే విధంగా రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి విడతల వారిగా రూ.20వేల రూపాయలు అందజేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.ఐదు వేలు, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ రూ.2వేలు కలిపి మొత్తం రూ.7 వేలు జమ చేయడంతో కూటమి ప్రభుత్వానికి రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ మేరకు 13న బుధవారం చొప్పెల్ల నుండి వాహనాలు, ఎడ్ల బండ్లుతో మండలంలోని రైతులు ర్యాలీగా బయలుదేరి స్థానిక ఏఎంసి కార్యాలయం చేరుకుంటుందన్నారు. అనంతరం జరిగే సంబర సభకు ముఖ్య అతిథులుగా కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరిష్ హరీష్ మాధ్యూర్, జనసేన నియోజకవర్గ ఇంచార్జి బండారు శ్రీనివాసరావు హాజరవుతారని వారు తెలియజేశారు. కూటమి నేతలు ఈదల సత్తిబాబు, సురపురెడ్డి సత్య, ఈదల నల్లబాబు, కేత రాంబాబు, కొత్తపల్లి నగేష్, చల్లా బాబి, తదితరులు పాల్గొన్నారు.

1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యా హక్కు చట్టం - 2009 ప్రకారం ప్రయివేటు, ఆన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025 -26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన చిన్నారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్(ఎపిసి) జి.మమ్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేద వర్గాల చిన్నారులకు కేటాయించే ఈ సీట్లకు అర్హత కలిగిన విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులను సచివాలయాల్లోనూ, మీ సేవా కేంద్రాల్లో లేదా ఇంటర్ నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. దరఖాస్తు చేసుకునేవారు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సిఎస్ఇ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శించి, 31 నుంచి ప్రవేశాలు కల్పిస్తారాన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్.1800 - 4258599ను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటలలోపు సంప్రదించాలన్నారు. దరఖాస్తులను రాష్ట్ర ఎస్‌పిడి కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. వికలాంగులు, హెచ్ఐవి భాదిత పిల్లలు, అనాథలు, వీధి పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఓట్ల అవినీతిపై కేంద్రం సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

దేశంలో జరుగుతున్న ఓట్ల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిసిసి అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును ఆయన ఖండించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓట్ల రాజకీయాలకు బిజెపి తెర తీసిందని విమర్శించారు. ఓటు హక్కు దుర్వినియోగంపై బయటపెట్టిన నిజాలపై సమాధానం చెప్పలేక అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. దొడ్డిదారిన బిజెపి గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌నే కలుషితం చేసిందని విమర్శించారు. డిజిటల్ ఓటర్ల జాబితా ఎందుకు ఇవ్వడం లేదని, సిసిటివి ఆధారాలు ఎందుకు నాశనం చేశారని, నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారు మారయిందని నిలాదీశారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఎన్నికల సంఘాన్ని చిట్టిబాబు డిమాండ్ చేశారు.



కర్రివానిరేవు గ్రామంలో మురహరి దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు

రిటైర్డ్ ఎఎస్ఐ మురహరికి సన్మానం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పోలీస్ శాఖలో ఎఎస్ఐగా పని చేసి ఇటీవలే వాకపల్లి మురహరిరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మురహరిరావు, కనకమహాలక్ష్మి దంపతులను స్వగ్రామమైన కర్రివానిరేవు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండలంలోని కర్రివానిరేవు గ్రామంలో మంగళవారం మాజీ సర్పంచ్ మోర్త వీర సూర్జం అధ్యక్షతన సన్మాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు అడ్వకేట్ పివి. సత్యనారాయణ, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తొలుత రిటైర్డ్ ఎఎస్ఐ వాకపల్లి మురహరి రావు, కనకమహాలక్ష్మి దంపతులనులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు అంకిత భావంతో విధులు నిర్వహించిన తన స్నేహితుడు, విధి నిర్వహణలో ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందించారన్నారు. పుట్టిన ఊరు, కుటుంబ సభ్యులు, గ్రామంపై పెంచుకున్న మమకారం మురహరి రావు నిజాయితీకి నిదర్శనమన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ సుమారు 42 సంవత్సరాల విధి నిర్వహణలో విశాఖపట్నంలో 26 పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి మధురవాడ పోలీసు స్టేషన్లో ఉద్యోగ విరమణ చేశానన్నారు. కార్యక్రమంలో కాశి గణపతరావు, కస్టమ్స్ అధికారి ఆర్. వీర్రాజు, కాశి ముని కుమారి, కాశి జగపతిరావు, పంచాయతీ కార్యదర్శి పి.సూర్య,వాకపల్లి మోహన్ రావు దంపతులు, వాకపల్లి రామకృష్ణ దంపతులు, పచ్చమట్ల సూర్యనారాయణ రాజు, మోర్త విష్ణుమూర్తి ,మోర్త ప్రసాదరావు, మత్స్యకార నాయకుడు ఓలేటి బంగ్లా రాజు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యరు శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్సరపు బిటెక్ మొదటి సంవత్సరపు తరగతులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత స్థాయి ప్రమాణాలతో నడుప బడుతున్న వంటి విద్యాసంస్థల్లో శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల యూనివర్శిటి స్థాయిలోనే విశిష్ట గుర్తింపు కల్గి ఉందన్నారు. ముఖ్య అతిథిగా అమలాపురం రీజయన్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టిఎస్ఆర్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ కళాశాల లో విద్య అత్యంత క్రమశిక్షణ, సమయపాలన, అకుంటిత దీక్షతో సాధించాలని సూచించారు. కళాశాల డైరక్టర్ యస్.వాసుదేవ రావ్ మాట్లాడుతూ కళాశాల విద్యారంభంలోనే ఆంగ్ల భాషా నైపుణ్యాలు, నాయకత్వలక్షణలు, ఉన్నత లక్ష్యం నిర్దేశంత విద్య నారించాలని దిశా నిర్దేశం చేశారు. డాక్టర్ బి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ కళాశాల మొదటి సంవత్స రం నుండే ప్రాంగణ నియమకములకు అవసరమగు శిక్షణ కళాశాల అందిస్తుం దన్నారు.కళాశాల బేసిక్ సైన్స్, హ్యూమానిటీస్ విభాగాధిపతి జానక రామయ్య మా ట్లాడుతూ ప్రతీ విద్యార్థికి మొదటి సంవత్సరం లో నేర్చుకునే ప్రాథమిక విషయాలైన గణిత, భౌతిక, రసాయన శాస్త్రముల అధ్యయనం కీలకమని ఉద్బో దించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, విద్యా శాఖాధి పతులు డాక్టర్ రవికుమారి, డాక్టర్ వెంకట్, డాక్టర్ రత్నరాజు, వైస్ ప్రిన్స్ పాల్ బాపి రాజు,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాలొ న్నారు.

పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యత

ప్రజాశక్తి - మామిడికుదురు

పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇవ్వాలని డిఎల్‌పిఒ బొజ్జి రాజు కార్యదర్శులకు సూచించారు మామిడికుదురు, మాకనపాలెం గ్రామాల్లో మంగళవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా వీధులలో ఎక్కడ చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు ఆయన వెంట ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారుజ

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మండపేట

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.కె.వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరం శ్రీకర రోబోటిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, రమా దంత వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ జి.రోహిత్‌కుమార్, డాక్టర్ ఎస్.జి.పద్వీకృష్ణ, తదితర వైద్య నిపుణులు మండపేట పరిసర ప్రాంతాల ప్రజలు మూడు వందల మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవ చేయడం ఆనందాన్ని ఇస్తుందని క్యాంపు వైద్యులు అన్నారు. కార్య క్రమంలో వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు వెంకన్న, డాక్టర్ మధు కుమార్, రాజేష్, అభినయ్, అంజి, తదితరులు,పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మండపేట

మండపేట పట్టణం 20వ వార్డు లో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.15 లక్షలతో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న సర్దార్ వేగుళ్ళ వీర్రాజు ప్రైమరీ స్కూల్ నిర్మాణానికి రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ టిడిపి అధ్యక్షులు మచ్చా నాగు, మేడింటి సూర్యప్రకాష్, కొవ్వాడ అప్పన్నబాబు, శెట్టి రవి, గండి నాగేశ్వరరావు, కట్టుమేను రామకష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఇఒపిఆర్‌డి ఆర్ మోహన్ అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వామిత్వ సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వే నిర్వహణా విధానాలన్నీ సిబ్బందికి వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి దస్తావేజులు, పట్టాల నకళ్లు, సేకరించి ఆస్తి పరిమాణాలకు అనుగుణంగా కొలతలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు కనీసం 75 ఇళ్లు కొలతలు పూర్తిచేసి సర్వేను త్వరగా ముగించాలన్నారు. జిల్లాలో మొత్తం 28 పంచాయతీలు ఈ సర్వే కోసం ఎంపిక య్యాయని ఆగస్టు 1 న ప్రారంభమైన ఈ ప్రక్రియ అక్టోబర్ నెలాఖరి నాటికి పూర్తవుతుందన్నారు. ఈ సర్వే పనులు జెసి పర్యవేక్షణలో జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, కార్యదర్శి కామేశ్వరరావు, సర్వేయరు ప్రశాంత్, డిజిటల్ అసిస్టెంట్ గోపీచంద్, అంగనవాడి, ఆశా కార్యకర్తలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

రెడ్డి అనంతకుమారి నియామకంపై పలువురి హర్షం

ప్రజాశక్తి - కొత్తపేట

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్పర్సన్‌గా రెడ్డి అనంత కుమారి నియమితులైనట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, పొలిట్ బ్యూరో రెడ్డిసుబ్రమణ్యం, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు టిడిపి ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ రాష్ట్రా జనాభాలో సగం పైగా బిసి లే ఉన్నారన్నారు. బిసిల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. చదువుకునే పిల్లలకు స్కాలర్ షిప్ లు ఇచ్చి ప్రోత్సహిస్థామన్నారు. ప్రతీ నియోజకవర్గం లోనూ బిసి సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. బాగా చదువుకునే పిల్లలకు విదేశీ విద్య అందేలా ప్రోత్సహిస్తామని అన్నారు.